

వైఫల్యాలే విజయ సోపానాలు

వైఫల్యాల వెనుకే విజయం దాగి ఉందని పలువురు వక్తలు తెలిపారు. అనంతపురం నగరంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో



టమాట కిలో రూ.28

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.28 పలికింది. కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.9°/21.7°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాతో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుంది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవరెడ్డికి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



అనంతపురం: యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం చేపట్టనున్న వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. సెప్టెంబర్ 6న ఐసెట్ (ఎంబీఏ, ఎంసీఏ), 11న పీజీ సెట్ (ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ), 26న ఏపీ లాసెట్, 30న ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ఉంటుంది.

అరుణాచలానికి 30న ప్రత్యేక బస్సు



పుట్టపర్తి టౌన్: శ్రావణ పౌర్ణమిను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఈనెల 30న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పుట్టపర్తి బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కూడా చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని హనుమాన్ క్షేత్రాల దర్శనం కోసం ఇప్పటికే ప్రతి మంగళ, శనివారాల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పుట్టపర్తి బస్టాండ్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా బుకింగ్ సదుపాయం కల్పించామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7382860486, 9440201570 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

30న ఉద్యోగ మేళా



అనంతపురం: హైదరాబాద్‌లోని హెటిరో కంపెనీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30న అనంతపురం శివారులోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయి. బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీకామ్, బీఏ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఉత్తీర్ణత సాధించి, 20 నుంచి 27 ఏళ్ల లోపు వయసున్న యువతీయువకులు అర్హులు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని హెటిరో కంపెనీలో వివిధ విభాగాల్లో పనిచేయాల్సి ఉంటుంది. వీరికి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం ఇస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో ఈ నెల 30న జరిగే వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.

ఉన్నత విద్యకు దీవెన

- నేడు జగనన్న విద్యాదీవెన మూడో త్రైమాసికం నిధుల విడుదల
- జిల్లాలో 35,044 మంది విద్యార్థులకు లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ.23.79 కోట్లు జమ చేయనున్న సీఎం జగన్



ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో పేద విద్యార్థుల చదువులకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ధనవంతుల పిల్లలతో పాటు పేద పిల్లలు కూడా ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ జగనన్న విద్యాదీవెన పథకం అమలు చేస్తోంది. ఏటా నాలుగు త్రైమాసికాల్లో క్రమం తప్పకుండా కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులను విద్యార్థి తల్లుల ఖాతాలలో జమ చేస్తోంది. ప్రభుత్వ చేయూతతో జిల్లాలోని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ వంటి కోర్సులు చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

గతం కంటే భిన్నంగా.. మిన్నగా..

జగనన్న విద్యా దీవెన ద్వారా మొదటి త్రైమాసికం నిధులను ఈ ఏడాది మార్చి 19న విడుదల చేశారు. జిల్లాలో 36,391 మంది విద్యార్థులకు సంబంధించి 32,909 మంది తల్లుల ఖాతాలకు రూ.22.85 కోట్లు జమ చేశారు. రెండో త్రైమాసికానికి సంబంధించి ఈ ఏడాది మే 24న 31,675 మంది తల్లులకు రూ.25.33 కోట్లు అందగా, మూడో త్రైమాసికంలో 32,004 మంది తల్లుల ఖాతాల్లో రూ.23.79 కోట్లు జమ కానున్నాయి. ఏటా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ విద్యాదీవెన లబ్ధి చేకూరుస్తున్నారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కంప్యూటర్ బటన్ నొక్కి తల్లుల ఖాతాకు 'జగనన్న విద్యాదీవెన' నిధులను సీఎం జగన్ జమ చేయనున్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ టి.అరుణ్ బాబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. గతం కంటే భిన్నంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కళాశాలల యాజమాన్యాలకు కాకుండా తల్లుల ఖాతాలకు జమ చేస్తూ వారికి యాజమాన్యాన్ని ప్రశ్నించే హక్కును కల్పించడం గమనార్హం.

జిల్లాలో జగనన్న విద్యాదీవెన అమలు ఇలా..

అర్హులైన విద్యార్థులు	35,044
జమ కానున్న నగదు	రూ.23.79 కోట్లు
మొదటి త్రైమాసికంలో లబ్ధి పొందిన వారు	32,909
రెండో త్రైమాసికంలో లబ్ధి పొందిన వారు	31,675

అర్హులైన ప్రతి విద్యార్థికీ భరోసా



జిల్లాలో అర్హులైన ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. విద్యార్థులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తిచేసుకోవాలి. లేదంటే పథకానికి అర్హత కోల్పోయే ప్రమాదం ఉంది. అర్హులై ఉండీ అందకపోతే మాకు వెంటనే ఫిర్యాదు చేయాలి. వారికి నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– శివరంగ ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి

ఆటంకం లేకుండా చదువులు



బీటెక్ ఈసీఈ నాలుగో సంవత్సరం చదువుతున్నా. నేను చెల్లించాల్సిన ఫీజు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తోంది. దీంతో మా తల్లిదండ్రులకు భారం తగ్గింది. ఈ ప్రభుత్వం మేలు మరువలేను. పేద విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరుకోవడానికి ప్రభుత్వం చక్కగా సహకరిస్తోంది.

– భార్గవి, విద్యార్థి, పుట్టపర్తి

క్రమం తప్పకుండా జమ



పేద,మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం విద్యాదీవెన ద్వారా అందిస్తున్న ఆర్థిక సహకారం మరువలేనిది. దీంతో నా లాంటి ఎందరో విద్యార్థులు బాగా చదువుకుంటున్నారు. డిగ్రీ పూర్తి చేసి మంచి ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకం ఉంది. ప్రభుత్వం క్రమం తప్పకుండా ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ మా తల్లి ఖాతాలో జమ చేస్తోంది.

– మనోజా, బీఎస్సీ కంప్యూటర్స్, పుట్టపర్తి

రొళ్ల జెడ్పీటీసీపై సస్పెన్షన్ ఎత్తివేత



అనంతరాజు

మడకశిర: రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకర నారాయణ తెలిపారు. పార్టీ జిల్లా కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరాజు ఇకపై పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని, మడకశిర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. పార్టీ అధిష్టాన నిర్ణయంపై ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆనందం వ్యక్తం చేశారు.

పెరిగిన వైఎస్సార్‌సీపీ బలం..

అనంతరాజుపై సస్పెన్షన్ ఎత్తివేతతో మడకశిర నియోజకవర్గంలో పార్టీ బలం మరింత పెరిగినట్లయింది. 'మడకశిర' కుంచిటి వక్కలిగ సంఘానికి అధ్యక్షుడిగా అనంతరాజు పని చేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ వర్గానికి చెందిన ఓటర్లు 80 వేల మంది ఉన్నారు. సస్పెన్షన్ ఎత్తివేసిన క్రమంలో వైఎస్సార్ సీపీకి ఈ వర్గం మద్దతు మరింత పెరగనుంది.


పేలుడు పదార్థాలు నమిలి పాడి ఆవు మృత్యువాత

చిలమత్తూరు: దేమకేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఎస్.నరసింహప్ప పాడి ఆవు పేలుడు పదార్థాలు నమిలి మృత్యువాత పడింది. అడవి పందులను వేటాడేందుకు కొందరు వేటగాళ్లు పచ్చిక బయళ్లలో పేలుడు పదార్థాలను ఉంచారు. ఈ విషయం తెలియని నరసింహప్ప ఆదివారం ఉదయం తన పాడి ఆవును మేపునకు పచ్చిక బయళ్లలో వదిలాడు. ఆ సమయంలో గడ్డితో పాటు పేలుడు పదార్థం నోట్లోకి వెళ్లి, ఆవు నమలగానే ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఆవు నోరు ముక్కలైపోయింది. కాసేపటి తర్వాత విలవిల్లాడుతూ మృతి చెందింది. రూ.75 వేలు విలువ చేసే పాడి ఆవు కోల్పోయినట్లు పాడిరైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

'పరిశ్రమి'స్తూ.. ఖ్యాతి పెంచుతూ!

పరిశ్రమల ఖిల్లాగా ఇప్పటికే జిల్లా పేరు మార్మోగుతోంది. ఇక్కడి పరిశ్రమల్లో తయారవుతున్న ఉత్పత్తులు రమారమి 24 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దుస్తులు, మందులు, కార్లు వంటివి అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ ఎగుమతవుతున్నాయి. ప్రతి నెలా కోట్లాది రూపాయల వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మరో రెండు నెలల్లో బెల్ సంస్థ ఏర్పాటుకు భూమి పూజ, నాసిన్ ప్రారంభోత్సవాలకు కసరత్తు జరుగుతోంది. ప్రఖ్యాతి పొందిన ఆ సంస్థల ఏర్పాటుతో జిల్లా ఖ్యాతి మరింత ఇనుమడించనుంది.

- జిల్లాలో కేంద్ర సంస్థల ఏర్పాటుపై వైఎస్సార్ సీపీ సర్కారు శ్రద్ధ
- గత ప్రభుత్వ హయాంలో నెమ్మదించిన ప్రక్రియలు ప్రస్తుతం వేగవంతం
- ప్రభుత్వ చొరవతో అక్టోబర్‌లో బెల్ సంస్థ భూమి పూజకు కేంద్రం కసరత్తు
- అదే నెలలో నాసిన్ ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- పరిశ్రమలు వస్తున్న నేపథ్యంలో ఈఎస్‌ఐ ఆస్పత్రికి ప్రతిపాదనలు
- నాసిన్ ఎదురుగా ఐదెకరాల కేటాయింపు



2019 తర్వాత జిల్లాలో ఏర్పాటైన పరిశ్రమల వివరాలు..

పెద్దతరహా పరిశ్రమలు	22
పెట్టుబడులు	రూ.14,790 కోట్లు
ఉద్యోగావకాశాలు	12,785
ఎంఎస్ఎంఈలు	1,532
పెట్టుబడులు	రూ.674 కోట్లు
ఉద్యోగావకాశాలు	11,312

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భారతదేశంలో 'బెల్' (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) అంటే తెలియని వారుండరు. రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థ యూనిట్‌ను పెనుకొండ నియోజకవర్గం పాలసముద్రం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. అక్టోబర్‌లో భూమి పూజ చేయనున్నారు. మొత్తం మూడు దశల్లో నిర్మాణ పనులు సాగనున్నాయి. తొలిదశలో రూ.384 కోట్లతో నిర్మిస్తారు. 2016లో సంస్థకు స్థలాలు కేటాయించినా పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక బెల్ సంస్థతో ముమ్మర సంప్రదింపులు చేసి నిర్మాణానికి చొరవ చూపింది.


నాసిన్ ప్రారంభోత్సవానికి కసరత్తు..

పాలసముద్రం ప్రాంతంలోనే నిర్మాణం పూర్తి చేసుకున్న నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్టర్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్) సంస్థ ప్రారంభోత్సవం అక్టోబర్‌లోనే నిర్వహించనున్నారు. కస్టమ్స్, ఇన్‌కం టాక్స్ అధికారులకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.మనదేశంలో ఎంపికైన వారే కాకుండా దక్షిణాది దేశాలకు చెందిన అధికారులకూ శిక్షణ ఇవ్వనున్నారు. బెల్‌కు భూమి పూజ, నాసిన్ ప్రారంభోత్సవం రెండూ ఒకేసారి చేస్తారని, దీనికి ప్రధాని మోదీ రానున్నట్టు అధికారులు చెబుతున్నాయి.

ఈఎస్‌ఐ ఆస్పత్రికి ప్రతిపాదన..

జిల్లాలో వందల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. సుమారు 50 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే కార్మికులను సౌకర్యంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. దీని కోసం నాసిన్ సంస్థ ఎదురుగా ఐదెకరాల స్థలం కూడా కేటాయించారు. ప్రస్తుతం ఫైలు కేంద్ర కార్మిక శాఖ పరిధిలో పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. తొలుత 50 పడకలతో, ఆ తర్వాత మరో 50 పడకలు పెంచనున్నట్లు సమాచారం.

మా ప్రభుత్వం వచ్చిన తర్వాతే కదలిక



గత ప్రభుత్వం కొన్ని సంస్థలకు భూములిచ్చినా, ఆ తర్వాత పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వేగం పెంచాం. బెల్ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా ఆ సంస్థ ప్రతినిధులను ఒప్పించాం. నాసిన్ నిర్మాణాలు వేగవంతమయ్యేలా చేశాం. మరికొన్ని సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి.

– మెట్టు గోవిందరెడ్డి, చైర్మన్, ఏపీఐఐసీ

మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి
- కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కాంట్రాక్టు లెక్చరర్లతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

కదిరి: 'వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరేలా ఐదేళ్ల నిబంధన తొలగిస్తూ సంబంధిత ఫైల్‌కు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఆయన మనసున్న ముఖ్యమంత్రి' అని ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. స్థానిక రహదారులు, భవనాల శాఖ అతిథి గృహ ప్రాంగణంలో ఆదివారం కాంట్రాక్టు లెక్చరర్లతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి ఆమె క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి ఎమ్మెల్సీ సమక్షంలో సంబరాలు జరుపుకున్నారు. 'సీఎం జగనన్నకు తోడుగా ఉందాం..జీవితాంతం రుణపడి ఉందాం..' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి మాట్లాడుతూ.. న్యాయ, చట్టపరమైన చిక్కులను అధిగమించి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయబోమని, సుప్రీంకోర్టు అందుకు అనుమతించదని గతంలో చంద్రబాబు ప్రభుత్వం సాకులు చెప్పిందని గుర్తు చేశారు. హామీని నెరవేర్చకుండా సుప్రీంకోర్టు తీర్పు పేరుతో కాంట్రాక్టు ఉద్యోగులను చంద్రబాబు మోసగించారని విమర్శించారు. సీఎం జగన్ మాత్రం మాటకు కట్టుబడి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నారన్నారు. ఆయనకు ప్రతి ఒక్కరూ జీవితాంతం రుణపడి ఉండాలని పేర్కొన్నారు. 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను సైతం చంద్రబాబు మోసగిస్తే జగనన్న వారికి న్యాయం చేశారని గుర్తు చేశారు. 2008 డీఎస్సీ అభ్యర్థులతో పాటు ఇంకా ఎంతోమంది నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేసిన ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. అంతకుముందు పలువురు ఉపాధ్యాయులు దుశ్శాలువలు, పుష్పగుచ్ఛాలతో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మెప్మా అర్బన్ మార్కెట్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఆహా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌తో పాటు సుస్థిర జీవనోపాధుల కల్పనలో భాగంగా ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ స్టాళ్లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాల రుచి చూశారు. 30 రకాల స్టాళ్లలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తక్కువ ధరకే శుచి, శుభ్రతతో కూడిన ఆహార పదార్థాలు అందించేందుకు ప్రభుత్వం ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థిక ప్రగతి సాధించాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి అక్కచెల్లెమ్మ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, సూర్యాగౌడ్, పవన్‌కుమార్, పరుశురాం నాయక్, కో ఆప్షన్ సభ్యుడు రఫీ, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ మాధవరెడ్డి, నాయకులు మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, కవితా, కేశప్ప, నాగిరెడ్డి, రాంజీనాయక్, మెప్మా పీఎంఎం రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



జాతరకు తరలివచ్చిన ప్రజలు

ఘనంగా ముత్యాలమ్మ జాతర

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురంలో ముత్యాలమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఐదేళ్లకోసారి జరిగే జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా వెంకటాపురం తీసుకెళ్లారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

కనగానపల్లి: సంతానం కలగలేదన్న ఆవేదనతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం కేఎన్ పాళ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వరెడ్డి, అనూష (24) దంపతులు. వీరికి సంతానం లేదు. దీంతో మానసిక వేదనకు లోనైన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


బోల్తాపడిన తవేరా వాహనం


తీవ్రంగా గాయపడిన హుస్సేన్

మడకశిర రూరల్: మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వినాయక చవితి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహాలను తయారు చేయించేందుకు పావగడ నుంచి కొందరు యువకులు తవేరా వాహనంలో మడకశిర మండలం అగ్రంపల్లికి బయలుదేరారు. అయ్యవారిపల్లి సమీపంలోకి చేరుకోగానే వాహనం యాక్సిల్ కట్ కావడంతో ఒక్కసారిగా తవేరా అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో తవేరాలో ప్రయాణిస్తున్న హుస్సేన్, తిమ్మరాజు, అభిషేక్, లక్ష్మమ్మ, అశోక్, ధనుష్, సిద్దు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే కాపాడి 108 అంబులెన్స్ ద్వారా మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తలకు బలమైన గాయాలైన హుస్సేన్‌ను బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అవెన్యూ ప్లాంటేషన్ విస్తీర్ణం పెంపు

అనంతపురం టౌన్: జిల్లాలో అవెన్యూ ప్లాంటేషన్ విస్తీర్ణాన్ని పెంచినట్లు ప్లాంటేషన్ మేనేజర్ సునీల్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 120 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, సంరక్షణ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటికే 100 కిలోమీటర్ల మేర మొక్కలను నాటే కార్యక్రమం పూర్తయిందన్నారు. ఇందుకోసం ఉపాధి నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు మరో 500 హెక్టార్ల విస్తీర్ణంలోని కొండగుట్టల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కాపు నేస్తంతో కాంతులు

- ఆ సామాజిక వర్గ మహిళలకు ఆర్థిక చేయూత
- ఏడాదికి రూ.15 వేలు.. ఐదేళ్లలో రూ.75 వేలు
- ఈ నెల 30న 4వ విడత నగదు జమ
- ఉమ్మడి జిల్లాలో గత మూడు విడతల్లో 31, 914 మందికి లబ్ధి




బీసీ కార్పొరేషన్ కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం లబ్ధి ఇలా

విడతలు	లబ్ధిదారులు	లబ్ధి
మొదటి	10,241	రూ.15.36 కోట్లు
రెండవ	10,344	రూ.15,51 కోట్లు
మూడో	11,329	రూ.16.99 కోట్లు
నాల్గో	11,950	రూ.17.09 కోట్లు (ఈ నెల 30న జమ)

అనంతపురం రూరల్: సంక్షేమం... అభివృద్ధికి సమానమైన ప్రాధాన్యతనిస్తూ జగన్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాలకూ ఆపన్న హస్తాన్ని అందిస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయిన కుటుంబాలకు నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనందిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కాపునేస్తం పథకం ఆ సామాజిక వర్గ మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడింది.

సుస్థిర అభివృద్ధి దిశగా..

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా పథకాలను ప్రవేశపెడుతూ సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాపు, బలిజ, తెలగ, ఒంటరి, ఉప కులాల మహిళల జీవన ప్రమాణాల్ని పెంచేలా.. వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చేలా ప్రవేశపెట్టిన వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత మూడు విడతల్లో 31,914 మందికి లబ్ధి చేకూరింది. ఆయా కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళల ఆర్థిక తోడ్పాటుకు ఈ పథకం దోహదపడుతోంది.

మూడు విడతల్లో రూ.47.87 కోట్ల లబ్ధి..

గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 10వేల లోపు ఆదాయం, పట్టణ పరిధిలో రూ.12 వేల ఆదాయం ఉన్న వాళ్లను అర్హులుగా గుర్తించి ఏటా రూ.15వేల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ లెక్కన అర్హులైన లబ్ధిదారులకు ఐదేళ్లలో రూ.75 వేల లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ మూడు విడతల్లో 31,914 మంది ఖాతాల్లోకి రూ.47.87 కోట్లు జమ కాగా, ఈ నెల 30న నాల్గో విడత కాపు నేస్తం నగదు జమ కానుంది. ఈ మేరకు చర్యలు పూర్తయ్యాయి. కాగా, నాల్గో విడత కాపు నేస్తానికి ఇది వరకే పథకం అందుకుంటున్న లబ్ధిదారులు రెన్యూవల్ చేసుకోగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో కలిపి 11,950 మందికి లబ్ధి చేకూరనుండడం గమనార్హం.

గతంలో ఎవరూ గుర్తించలేదు



గతంలో ఏ ప్రభుత్వమూ మా కష్టాలను గుర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాపు నేస్తం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. ఈ డబ్బుతో చిన్నపాటి వ్యాపారం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సునందమ్మ, కూడేరు

ఆర్థికంగా ముందుకు



కాపు కులాల్లో ఉన్న పేదలను గుర్తించి ఏటా కాపు నేస్తం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం. ఈ డబ్బు మా కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడ్డాయి. ఇచ్చిన మాట నెరవేర్చుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్ని వర్గాలకు అండగా నిలిచారు.

– చదువుల గంగమ్మ, నరసనాయనకుంట

అర్హులందరికీ వర్తింపు



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కాపు నేస్తం కింద ఆర్థిక సాయం అందజేస్తున్నాం. గతంలో లబ్ధి పొందిన వారికి రెన్యువల్ చేయడంతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేశాం. ఈ నెల 30న వీరి బ్యాంక్ ఖాతాల్లోకి ప్రభుత్వం నగదు జమ చేయనుంది.

– సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐ

- భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం
- సకాలంలో స్పందించిన సీఐ శంకరరెడ్డి


పెద్దిరెడ్డిని సముదాయిస్తున్న సీఐ శంకరరెడ్డి

యాడికి: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేయబోయిన వ్యక్తి ప్రాణాలను సీఐ శంకరరెడ్డి సకాలంలో కాపాడారు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తి నివాసి పెద్దిరెడ్డికి నాలుగేళ్ల క్రితం శింగనమల మండలం బండమీదపల్లికి చెందిన యువతితో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కొన్నాళ్ల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు భర్త ప్రాధేయపడిన ఆమె కాపురానికి రాలేదు. ఈ క్రమంలో పెద్ద మనుషుల పంచాయితీ నిర్వహించి, నచ్చచెప్పినా ఆమె రాజీ పడలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న పెద్దిరెడ్డి ఆదివారం యాడికి మండలం రాయలచెరువులోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇదే విషయాన్ని తన కుటుంబసభ్యులకు వీడియో కాల్ చేసి తెలిపాడు. అప్రమత్తమైన పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించడంతో విషయం తెలుసుకున్న యాడికి సీఐ శంకరరెడ్డి, ఎస్‌ఐలు గురుప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెద్దిరెడ్డి ఉన్న ప్రాంతాన్ని గుర్తించి, అక్కడకు చేరుకున్నారు. అప్పటికే పట్టాలపై పడుకుని రైలు రాక కోసం వేచి చూస్తున్న పెద్దిరెడ్డిని గమనించి, వెంటనే పక్కకు లాగారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించడమే కాక, పెద్దిరెడ్డి భార్యతో ఫోన్‌లో మాట్లాడి ఆమె కాపురానికి వచ్చేలా ఒప్పించారు.

‘ఆ’జాదూ ఎంపీడీఓ మాకొద్దు

- జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓకు మహిళా ప్రజాప్రతినిధి వినతి
- మద్యం మత్తులో విధులకు హాజరవుతున్నట్లు ఫిర్యాదు
- మహిళలతో అసభ్య ప్రవర్తన అంటూ ఆవేదన

అనంతపురం సిటీ: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే మాయగాడైన ఎంపీడీఓ తమకు అక్కర్లేదని, ఆయనను తక్షణమే బదిలీ చేయాలంటూ జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌కు ఓ మహిళా ప్రజాప్రతినిధి విన్నవించింది. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా హాజరైన సభ్యులు తొలుత ఆశ్చర్యపోయారు. తర్వాత ఎంపీడీఓ తీరుపై మండిపడ్డారు.

మద్యం మత్తులో విధులు..

తమ మండలంలో పనిచేస్తున్న ఎంపీడీఓ తీరు సరిగా లేదని శ్రీసత్యసాయి జిల్లా కర్ణాటక సరిహద్దులోని ఓ మండల ప్రజాప్రతినిధి (మహిళ) ఏకంగా జెడ్పీ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు మద్యం మత్తులో హాజరై ఆయన... మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వాపోయారు. గతంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓ మండలంలో పని చేసిన సమయంలోనూ ఓ చిరుద్యోగితో సహజీవనం సాగిస్తూ వివాదాలకు కేంద్రీకృతమయ్యాడు. దీంతో డిప్యుటేషన్‌పై పక్క నియోజకవర్గంలోని మరో మండలానికి బదిలీ చేసినా.. అక్కడ కూడా వివాదాల్లో చిక్కుకోవడంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేయడంతో మరో ప్రాంతానికి బదిలీ చేశారు. తాను ఏ ప్రాంతంలో పనిచేసినా.. అక్కడ పనిచేస్తున్న మహిళా చిరుద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వేధించేవాడు. ప్రస్తుతం కర్ణాటక సరిహద్దులోని ఓ మండలంలో పనిచేస్తున్న ఆయన తన తీరు మార్చుకోకపోవడంతో విషయం కాస్త జెడ్పీ సమావేశంలో చర్చనీయాంశమైంది. ఈ అంశాన్ని జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

వ్యక్తి దుర్మరణం


న్యాతప్ప (ఫైల్)

లేపాక్షి: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో లేపాక్షి మండలానికి చెందిన వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. మండలంలోని విభూతినపల్లికి చెందిన ఈడిగ న్యాతప్ప (50), భారతి దంపతులు. వీరికి సంతానం లేదు. ఆదివారం ఉదయం కాలువ కుర్లపల్లి (తన పుట్టినిల్లు)కి ద్విచక్ర వాహనంపై న్యాతప్ప బయలుదేరాడు. గౌరిబిదనూరు తాలూకా డీపాళ్యం సమీపంలో నక్కలపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొంది. ఘటనలో తీవ్ర గాయాలతో న్యాతప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారు నగల అపహరణ

సోమందేపల్లి: స్థానిక శిరిడీ నగర్‌లో నివాసముంటున్న మారుతీ ఇంట్లో దుండగులు చొరబడి రూ.లక్ష విలువైన బంగారు నగలతో పాటు ద్విచక్ర వాహనం అపహరించుకెళ్లారు. అహోబిలంలో జరిగే బంధువుల శుభకార్యంలో పాల్గొనేందుకు మారుతి శనివారం వెళ్లారు. అదే రోజు రాత్రి ఆయన భార్య సుగణ ఇంటికి తాళం వేసి స్థానికంగా ఉంటున్న తన పుట్టింటికి వెళ్లారు. ఇంటికి వేసిన తాళం గమనించిన దుండగులు అర్ధరాత్రి దాటిన తర్వాత లోపలకు ప్రవేశించి బీరువా బద్ధలుగొట్టి అందులోని రూ.లక్ష విలువైన బంగారు నగలతో పాటు, ఇంటి ఆవరణలో నిలిపిన ద్విచక్ర వాహనం అపహరించుకెళ్లారు. ఆదివారం సాయంత్రం ఈ విషయాన్ని గమనించిన బాధితుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లెక్క..ఇక పక్కా!

సూక్ష్మసేద్య పరికరాల కోసం ప్రభుత్వం ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ సబ్సిడీతో పొందిన పరికరాలను రైతు ఉపయోగిస్తున్నారా..? లేదా.. అసలు జిల్లాలో ఎన్ని హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం చేస్తున్నారు.. తదితర వివరాలు ఎవరి వద్దా పక్కాగా లేవు. దీంతో ప్రభుత్వం ఈ ఖరీఫ్ నుంచి ఈ–క్రాప్‌లో సబ్సిడీపై పొందిన పరికరాల వివరాలనూ నమోదు చేస్తోంది.

- ఈ–క్రాప్‌లో డ్రిప్, స్ప్రింక్లర్ల వివరాల నమోదు
- తొలిసారిగా ఈ ఖరీఫ్ నుంచి అమలు
- జిల్లా వ్యాప్తంగా లక్ష హెక్టార్లలో డ్రిప్ పరికరాల వినియోగం


డ్రిప్ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల వివరాలనూ ఈ–క్రాప్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో ఇంకా ఎంత మందికి సబ్సిడీతో కూడిన పరికరాలు అందించాలన్న వివరాలు తెలిసే అవకాశం ఉంది. అలాగే ఇప్పటికే పంపిణీ చేసిన పరికరాలు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

1,23,599 హెక్టార్లకు పరికరాలు..

తక్కువ నీటితో పంటలు సాగుచేసే రైతులకు సబ్సిడీతో బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించే ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకాన్ని (ఏపీఎంఐపీ) వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ప్రారంభించారు. ఈ పథకం కిందన 50 శాతం నుంచి 90 శాతం సబ్సిడీతో రైతులకు సూక్ష్మ పరికరాలు అందిస్తున్నారు. వైఎస్సార్ హయాంలోనే 39,874 మంది రైతులకు 42,560 హెక్టార్లకు సబ్సిడీ పరికరాలు అందజేశారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకానికి కొనసాగిస్తూ వచ్చాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ జిల్లాలోని 1,11,431 మంది రైతులకు 1,23,599.94 హెక్టార్లకు సరిపడా పరికరాలను అందజేశారు. వీటన్నింటినీ ఉద్యాన తోటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలకు వినియోగిస్తున్నారు. వీటి లెక్క తేలితే రానున్న రోజుల్లో మరింత మంది రైతులకు అందజేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

లెక్కల పక్కాగా తేల్చేందుకు...

సాధారణంగా డ్రిప్, స్ప్రింక్లర్లను ఏడేళ్ల నుంచి పదేళ్ల వరకూ వినియోగించవచ్చు. ఆ తర్వాత రైతు కోరితే ప్రభుత్వం మరోసారి సబ్సిడీపై సదరు పరికరాలను అందజేస్తుంది. కానీ సబ్సిడీతో అందజేసిన సూక్ష్మ పరికరాలు జిల్లాలో ఎంత మంది రైతులు వినియోగిస్తున్నారు..? ఇంకా ఎంత మందికి పరికరాలు అందించాల్సి ఉంది...? పరికరాలు ప్రస్తుతం ఎలాంటి పరిస్థితిలో ఉన్నాయి. అనే వివరాలు ప్రభుత్వం వద్ద లేవు. దీంతో మళ్లీ సబ్సిడీపై పరికరాలు మంజూరు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అలాగే గత టీడీపీ హయాంలో రూ.రూ.450 కోట్లతో కొనుగోలు చేసిన రెయిన్ గన్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్, డీజిల్ ఇంజిన్లు కూడా ఎవరి వద్ద ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. వాస్తవానికి ఈ పరికరాలను తీసుకెళ్లిన రైతులు పంట కాలం ముగియగానే వెనక్కు ఇవ్వాల్సి ఉంది. కానీ రైతులు వాటిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించలేదు. అసలు ఆ పరికరాలు ఎక్కడున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ప్రభుత్వం ఈ–క్రాప్ నమోదులో భాగంగా రైతులు వినియోగిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను నమోదు చేసి లెక్క కట్టనుంది.

నమోదు ఇలా...

ఈ–క్రాప్ నమోదుకు ప్రభుత్వం కొత్తగా ఈ–కర్షక్ యాప్ అమలు చేస్తోంది. ఇందులో ఈ–క్రాప్ బుకింగ్‌లో ఇరిగేషన్ సోర్స్‌లోకి వెళ్లి నేచర్ ఆఫ్ ఇరిగేషన్ సెలెక్ట్ చేసుకోవాలి. అప్పుడు అక్కడ బోర్‌వెల్, ఓపెన్ వెల్, డ్రిప్, స్ప్రింక్లర్ టిక్ చేస్తే తోటలతో పాటు పరికరాల వివరాలు నమోదవుతాయి. గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు చేసే రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తోటల్లోకి వెళ్లిన సమయంలో కచ్చితంగా ఉద్యాన పరికరాల వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

వివరాల నమోదు తప్పనిసరి


సుదర్శన్, పీడీ, ఏపీఎంఐపీ

ఈ–క్రాప్‌లో పంట వివరాలు, సాగు విస్తీర్ణంతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. దీంతో ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన పరికరాలను రైతులు వినియోగిస్తున్నారా..? లేదా.. అన్నది తెలుస్తుంది. ఈ మేరకు ఇప్పటికే సిబ్బందికి సూచనలు చేశాం. రైతులకూ అవగాహన కల్పిస్తున్నాం.

వైఫల్యాలే విజయానికి సోపానాలు

- కలెక్టర్ గౌతమి
- అట్టహాసంగా గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) విశాల ఫెర్రర్


పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: వైఫల్యాల వెనుకే విజయం దాగి ఉంటుందని, ఓటమితో కుంగి పోకుండా రెట్టింపు ఉత్సాహంతో క్రీడల్లో పోటీ నప్పుడే విజయం సొంతమవుతుందని క్రీడాకారులకు కలెక్టర్ ఎం. గౌతమి సూచించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించడం గొప్ప విషయమమంటూ నిర్వాహక సంస్థ ఆర్డీటీని అభినందించారు. ఆర్డీటీ స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్ సెక్టార్ ద్వారా అనంత క్రీడాగ్రామం వేదికగా గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ – 2023 పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ గౌతమి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించడం శుభ పరిణామన్నారు. ఆర్డీటీ సేవలను కొనియాడారు. ఈ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో వివిధ స్థాయిల్లో 3 వేల మంది క్రీడాకారులు పోటీ పడగా.. ప్రతిభ చాటుకున్న 350 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 38 ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మూడు రోజుల పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం పోటీలు ఉత్సాహంగా సాగాయి. 100, 200, 400, 4 X100 మీటర్ల రిలే పరుగుతో పాటు లాంగ్ జంప్, షాట్ పుట్ తదితర ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తొలి రోజు విజేతలు ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సెమీ–ఫైనల్, ఫైనల్స్‌లో పోటీపడేందుకు అర్హత సాధించారు.